"ఉత్తిష్ఠత!జాగృత!ప్రాప్యవరాన్నిబోధత"

కలియుగాబ్ది 5128

# హిందూ నగారా

మాసపత్రిక

సంపుటి 34 ❀ సంచిక : 10 ❀ శ్రీ పరాభవ నామ సంవత్సరం ❀ ఆశ్వీయుజ మాసం ❀ అక్టోబరు 2026 ❀ పేజీలు : 16 ❀ విడిప్రతి : రూ 10





## దక్షిణ కాశీ కుండలేశ్వర స్వామి ఆలయం





## సేద్యంలో రైతన్నకు ఏఐ సాయం

## ప్రాణాలకు తెగించి 180 మందిని కాపాడాడు!

### భారత పైలట్ సుమిత్ మచ్చర్‌పై ప్రశంశల వర్షం




అతనిపై కత్తితో దాడి జరిగింది. విమానం కిందకు పడిపోతోంది. అయినా, తన వెనుక ఉన్న వారి ప్రాణాలను కాపాడటానికి పోరాడాడు. ఫ్లై దుబాయ్ విమానం దుబాయ్ నుండి టెల్ అవీవ్‌కు వెళుతుండగా భారత్‌కు చెందిన హిందూ పైలట్ కెప్టెన్ సుమిత్ మచ్చర్‌పై, కో-పైలట్ దాడి చేశాడు. అత్యవసర పరిస్థితి తలెత్తడానికి కొద్ది క్షణాల ముందు విమానం 17 వేల అడుగులకు పైగా కిందకు పడిపోయింది. తీవ్రంగా గాయపడినప్పటికీ, మచ్చర్ విమానంపై తిరిగి నియంత్రణ సాధించగలిగాడు. వెంటనే ప్రయాణికులు కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లి కో-పైలట్‌ను అదుపు చేయడంలో సహాయపడ్డారు. అదే సమయంలో, విమానంలో ఉన్న రిజర్వ్ పైలట్లు బాధ్యతలు స్వీకరించి, విమానాన్ని సౌదీ అరేబియాలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. **విమానాన్ని హైజాక్ చేసి కూల్చేయాలని కో-పైలట్ చేసిన ప్రయత్నాన్ని వమ్ము చేసిన హిందూ పైలట్ మచ్చర్‌ను హీరోగా ప్రపంచం కీర్తిస్తోంది.** ఆయన స్పైస్ జెట్‌లో పదేళ్ల పాటు పనిచేశాడు. నాలుగేళ్ల క్రితం దుబాయ్ ఎయిర్‌లైన్స్‌కు వెళ్లి అక్కడే పని చేస్తున్నాడు. ఆయన కుటుంబం భారతదేశంలోనే ఉంటుంది. ఫ్లైట్‌ను కూల్చేయాలని ప్రయత్నం చేసిన కో-పైలట్ తనను కత్తితో పొడిచినా మొక్కవోని ధైర్యంతో నిదానంగానే అతడిని ఎదుర్కొని, విమానాన్ని కంట్రోల్ చేశాడు. ఆ సమయంలో అందులో ఉన్న 180 మంది ప్రయాణికుల్లో 100 మంది ఇజ్రాయిల్ దేశస్తులే.. అందుకే అతను విమానం కూల్చేయాలని నిర్ణయించుకున్నాడు. విమానం ల్యాండ్ అయిన వెంటనే ఆ కో-పైలెట్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. **మీ ప్రాణాలకు ప్రమాదం ఉందని, మీ వెనుక 170 మందికి పైగా ప్రయాణికులు మీపై ఆధారపడి ఉన్నారని తెలిసినప్పుడు కూడా పోరాటం కొనసాగించడానికి ఎంత ధైర్యం కావాలో ఆలోచించండి. వారు ఎవరో అతనికి తెలియదు. వారు తన బాధ్యత అని మాత్రమే అతనికి తెలుసు. ధైర్యం అంటే ఇలా ఉంటుంది.**

## రైతు కుటుంబ నుంచి అంతర్జాతీయ స్థాయికి

తెలంగాణలోని ఒక కుగ్రామానికి చెందిన రైతు కుటుంబంలో పుట్టిన అమ్మాయి విలువిద్య నేర్చుకోవడానికి విల్లు కొనడానికి అప్పులు చేయాల్సివచ్చింది. ఈ రోజు అదే అమ్మాయి ఆసియన్ గేమ్స్‌లో రెండు బంగారు పతకాలను గెలిచింది. ఆ అమ్మాయే చికితా తనిపర్తి. పెద్దపల్లి జిల్లా సుల్తాన్‌పూర్ గ్రామంలో ఆమె తండ్రి శ్రీనివాసరావు వ్యవసాయం చేస్తాడు. అతనికి రెండెకరాల పొలం ఉంది. అదే వారి కుటుంబానికి జీవనాధారం. అయితే కూతురు కంటున్న కల చాలా పెద్దది. గొప్ప విలు విద్య క్రీడాకారిణి కావాలనుకునేది. **చికితాకు చిన్నపుడు ఒక బంధువు చిన్న విల్లు ఆడుకోవడానికి తెచ్చి ఇచ్చాడు. పొలంలో కాసింత దూరంలో లక్ష్యం ఏర్పాటుచేసుకుని, ప్రారంభించిన ఆట మెల్లమెల్లగా జీవితం అయిపోయింది.** అంతలోనే ఒక కష్టం ఎదురైంది. ఒక మంచి నాణ్యమైన, అధునాతన విల్లు కొనుక్కోవడానికి ఆమె కుటుంబం అప్పు చేయాల్సి వచ్చింది. అంతేకాదు శ్రీనివాసరావు తనకున్న rice harvester ను కూడా అమ్ముకోవాల్సి వచ్చింది. మొదటిసారిగా విల్లు కొనేందుకు వెళ్తే రూ. 1.5లక్షలు మోసపోయి, ఖర్చు చేయాల్సి వచ్చింది. మరోసారి అప్పుచేసి కొత్త విల్లు కొన్నారు. ఇంటి దగ్గరే కార్డ్ బోర్డుతో చేసిన లక్ష్యాల మీద అభ్యాసం ప్రారంభించింది చికితా. తర్వాత స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాకు చెందిన సోనిపత్ సెంటర్‌లో చేరింది. అక్కడ అభిషేక్ వర్మ మార్గదర్శనంలో ఎదిగి ఇప్పుడు **2026 ఆసియన్ గేమ్స్‌లో చికితా రెండు బంగారు పతకాలను సాధించింది. మొదటిది- జ్యోతి సురేఖ వెన్నం, పృథికా ప్రదీప్‌తో కలిసి మహిళల కాంపౌండ్ టీం ఈవెంట్ లో.** రెండోది సాహిల్ జాధవ్ తో కలిసి మిక్స్ టీమ్ ఈవెంట్‌లో. మిక్స్ టీమ్‌లో గెలిచిన బంగారు పతకం ఎంతో అమూల్యమైనది. దక్షిణ కొరియా ఎదురుగా షూట్ ఆఫ్‌లో గెలుపుతోబాటు, 2028లో లాస్‌ఏంజిలిస్‌లో జరగబోయే ఒలింపిక్స్‌లో కాంపౌండ్ ఆర్చరీలో మొదటి కోటా స్థానం సాధించింది. లాస్ ఏంజిలిస్ ఒలింపిక్స్‌లో ఈ ఈవెంట్ మొదటిసారిగా ప్రవేశపెట్టనున్నారు. **"రైతు కుటుంబం నుండి వచ్చి అంతర్జాతీయ పతకం గెలవడం చాలా పెద్ద విషయం"** అని చెప్పిన సుల్తాన్‌పూర్ అమ్మాయి కేవలం రెండు బంగారు పతకాలు గెలవలేదు. తన గ్రామంలో తాను కన్న కలను ప్రపంచ వేదిక మీదకు చేర్చింది. ఇలాంటి గ్రామీణ ప్రతిభలు ఇంకెన్ని ఉన్నాయో!



# విజయదశమి.. సామాజిక శక్తి





**అ**సుర శక్తి విజృంభించి సాత్విక శక్తులను అణచివేస్తున్న తరుణంలో, సృష్టిని కాపాడటానికి దైవిక శక్తులన్నీ కలిశాయి. ఆ దైవిక శక్తులు దుర్గ అవతారాన్నిదాల్చి, అసుర శక్తిని అంతమొందించిన రోజే విజయ దశమి. పశు ప్రవృత్తిని ఎదుర్కొనడానికి సాత్విక శక్తి సంఘటితం కావాల్సిన అవసరాన్ని విజయదశమి పండుగ మనకు తెలియజేస్తుంది. పురాణ కాలంలో రాక్షసులు తమ పశుబలంతో, మందబలంతో దేవతల మీదే కాకుండా సాధారణ ప్రజల మీద కూడా విరుచుకుపడేవారు. సమస్త లోకాలను అణచివేతకు గురిచేసేవారు. వారి ఆగడాలను ఎదుర్కొని, వారిని అంతం చేయడానికి దుర్గ అవతరించింది. **దశమి రోజున సమస్త లోకాలకు రాక్షస పీడ తొలిగినందున అది విజయదశమి అయింది. సమాజానికి ఎదురైన ఆపద తొలిగిపోయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆనాటి నుంచి విజయదశమిని పండుగలా ఆచరించడం అలవాటుగా మారింది.** ఆధునిక కాలంలో రాక్షసులు లేరు గానీ రాక్షస ప్రవృత్తి మాత్రం కనబడుతోంది. ఈ కారణంగా సమాజం కష్టాలపాలవుతోంది. ఆ రాక్షస ప్రవృత్తిని అడ్డుకోవడానికి ఆధునిక కాలానికి కూడా పురాణ కాలంనాటి సంఘటనే ఆదర్శం అయింది. సాధారణ సమాజం ఐకమత్యంతో మెలిగి, ఒక్కటైతే తప్ప అరాచక శక్తులను ఓడించడం సాధ్యం కాదు. ఆ పని చేయడానికి ఎవరో ఒకరు పూనుకోవాల్సిందే. **సమాజాన్ని కలిపి ఉంచే పనిని ఒక వైద్యుడు, దేశభక్తుడు తన భుజాల మీద వేసుకున్నాడు. ఆయనే డాక్టర్ కేశవరావు బలీరాం హెడ్గేవార్. ఆనాటి దేశ పరిస్థితులను గమనించి 1925లో రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్‌ను ప్రారంభించారు. ఈ దేశంలో హిందువులు సంఘటితమైతే తప్ప, ఈ దేశం మనుగడ సాధించలేదనే సత్యాన్ని గుర్తించి పనిలోకి దిగారు.** హిందూ సమాజాన్ని సంఘటిత పరచడం అనే లక్ష్యం చేరుకోవడానికి వ్యక్తిలో మార్పు తీసుకురావడం అవసరం. దీనికోసం శాఖా పద్ధతిని అమలు పరిచాడు. శాఖలో నిర్వహించే చిన్న చిన్న కార్యక్రమాల ద్వారానే వ్యక్తిలో మార్పు రావడానికి సాధ్యమైంది. ప్రతిరోజూ కేవలం ఒక గంట సేపు జరిగే శాఖవల్ల ఆయన అనుకున్న మార్పు రావడం మొదలైంది. వ్యక్తి నిర్మాణ ప్రక్రియ ద్వారా సామూహిక శక్తికి బీజం పడింది. **సామూహిక శక్తి ఎంత ప్రభావం చూపుతుంది అనడానికి సంఘ ప్రారంభం అయిన ఒకట్రెండు సంవత్సరాలలో నాగపూర్‌లో జరిగిన సంఘటన ఉదాహరణగా నిలుస్తుంది. కొందరు మతోన్మాదులు, పండుగ సంతోషంలో ఉన్న హిందువుల ఇళ్ళపై దాడిచేసి దోచుకోవాలని అనుకున్నారు. అది పసిగట్టిన సంఘ స్వయంసేవకులు హిందూ సమాజానికి అండగా నిలిచారు. ఆ దాడిని తిప్పికొట్టారు. హిందూ సమాజంలో ధైర్యాన్ని కలిగించారు. ఆ చిన్న సంఘటన సమాజంలో విశ్వాసాన్ని రేకెత్తించింది.** హిందువులందరూ సమైక్యంగా ఉంటే, ఏ శక్తి కూడా తమను దెబ్బకొట్టలేదని గుర్తించారు. ఆనాడు దేవతలందరూ తమ శక్తులను ధారపోసి ఒక సమైక్య శక్తికి ప్రాణం పోసిన విధంగానే, ఈనాడు సాధారణ ప్రజలంతా తమ శక్తులను ధారపోస్తే, సమాజ, దేశ వ్యతిరేక శక్తుల ఆటలు సాగవు అనే సందేశాన్ని మనకు గుర్తుచేసే పండుగే విజయదశమి. ఆ పండుగ అందించే సందేశాన్ని మరోసారి స్మరించుకుని, ఆచరణలో పెడదాం.

# శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోండి.. అజిత్ డోభాల్



**జీ**వితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగాలని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ విద్యార్థులకు సూచించారు. ఇందుకోసం శ్రీరాముడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని ఐఐటీ రూర్కీలో జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విశ్వామిత్ర మహర్షి తన యజ్ఞాన్ని రాక్షసుల నుంచి రక్షించేందుకు శ్రీరాముడిని ఎంచుకున్న సందర్భాన్ని ఆయన ప్రస్తావించారు. శ్రీరాముడిలో ఉన్న అసాధారణ ధైర్యం, సాహసమే ఆయనను ఆ బాధ్యతకు ఎంపిక చేసేలా చేసిందని తెలిపారు. విద్యార్థులు కూడా జీవితంలో ఎదురయ్యే సవాళ్లకు భయపడకుండా, ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రస్తుత తరం విద్యార్థులు అపారమైన అవకాశాలు ఉన్న సమయంలో ప్రపంచంలోకి అడుగుపెడుతున్నారని అన్నారు. సాంకేతిక విప్లవం వేగంగా జరుగుతున్న ఈ సమయంలో పట్టాలు అందుకుంటున్న విద్యార్థులు "వెయ్యేళ్లలో అత్యంత అదృష్టవంతమైన తరం" అని అభివర్ణించారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ యువతకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. ఐఐటీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో చదివిన యువత తమ జ్ఞానం, నైపుణ్యాలను సమాజం, దేశ అభివృద్ధికి ఉపయోగించాలని కోరారు. జ్ఞానంతో పాటు ధైర్యం, కర్తవ్యబద్ధత, సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం యువతకు అవసరమని పేర్కొన్నారు.

# నిశ్చలమైన గురుభక్తే ప్రధానం



జగద్గురువు ఆదిశంకరాచార్యుల వద్ద నలుగురు ప్రధాన శిష్యులు ఉండేవారు. వారి పేర్లు తోటకాచార్యులు, హస్తమలకాచార్యులు, సురేశ్వరాచార్యులు, పద్మనాభుడు. వారిలో చదువులో అందరికంటే పద్మనాభుడే వెనకబడి ఉండేవాడు. అందుకు కారణం అతనికి చదువులో కంటే గురుభక్తిలో శ్రద్ధ ఎక్కువ. గురువు వాక్కు అతడికి వేదవాక్కుతో సమానం. చదువులో వెనకబడి ఉన్నాడని అందరూ అతడిని చులకనగా చూసేవారు. గురువుగారి సేవలు అతనే స్వయంగా చేసేవాడు. ఒకరోజు ఆయన వస్త్రాలు నది మధ్యన ఉన్న ఇసుక తిన్నె మీద ఆరవేశాడు. నది ఆకస్మికంగా పొంగి ఇసుక తిన్నెను కూడా ఆక్రమించింది. ఆ సమయంలో అతను వస్త్రాలను చేతుల్లో పట్టుకొని గురువుగారికి అర్పించాలనే సంకల్పంతో ఉన్నాడు. ఆ పరిస్థితుల్లో అతడికి ఏం చేయాలో తోచలేదు. గురువుగారి మీద భారం వేసి ఆ ప్రవాహంలో ఒక్కో అడుగూ వేయసాగాడు. అతని అచంచల గురుభక్తి ప్రభావంతో అతను అడుగు పెట్టిన స్థలంలో ఒక్కో పద్మం ప్రత్యక్షమైంది. అలా పద్మాల మీదుగా నడుచుకుంటూ సురక్షితంగా తీరాన్ని చేరుకున్నాడు. అతని పేరు పద్మనాభుడైనా అప్పటి నుంచి పద్మపాదుడిగా ప్రసిద్ధి పొందాడు. నిశ్చలమైన గురుభక్తితో సాధించలేనిది ఏదీ లేదని ఈ ఘటన మరోసారి నిరూపించింది.

## ఈ నెల పద్యము



**॥ కట్టడ దప్పి తాము చెడు కార్యము చేయుచునుండిరేని దో**
**బుట్టిన వారినైన విడిపోవుట కార్యము; దౌర్మదాంధ్యమున్**
**దొట్టిన రావణాసురునితో నెడబాసి విభీషణాఖ్యుడా**
**పట్టున రాము జేరి చిరపట్టము గట్టుకొనండె భాస్కరా ॥**

**భావము:** అదుపు తప్పి చేయకూడని పనులు చేసేవాడు స్వయంగా సోదరుడే అయినప్పటికీ... అటువంటి వారిని విడిచిపెట్టటం మంచిది. అలా చేసినవారికి మంచే జరుగుతుంది. ఈ పద్ధతిని అనుసరించే రావణుడి సోదరుడయిన విభీషణుడు తన అన్నను విడిచి శ్రీరాముని చేరి, శాశ్వతమైన లంకానగర ఆధిపత్యాన్ని పొందాడు.

# పల్లెటూరి నుంచి ప్రపంచ వేదికపైకి శ్రీచరణి

కడప జిల్లాలోని యర్రంపల్లి అనే చిన్న గ్రామం నుంచి అంతర్జాతీయ క్రికెట్ ప్రపంచంలోకి అడుగుపెట్టిన యువ క్రీడాకారిణి నల్లపురెడ్డి శ్రీచరణి. గ్రామీణ వాతావరణం నుంచి భారత మహిళల క్రికెట్ జట్టులో స్థానం సంపాదించడం ఆమె ప్రతిభకు, పట్టుదలకు నిదర్శనం. 2004 ఆగస్టు 4న జన్మించిన శ్రీచరణికి చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి. మొదట్లో ఖోఖో, అథ్లెటిక్స్ వంటి క్రీడల్లో పాల్గొంది. మేనమామ కిశోర్ రెడ్డి ప్రోత్సాహంతో క్రికెట్ నేర్చుకుంది. మొదట్లో కుటుంబ సభ్యుల నుంచి కొంత వ్యతిరేకత ఎదురైనా, క్రికెట్‌పై తనకున్న ఇష్టాన్ని వదులుకోకుండా ముందుకు సాగింది. **దేశవాళీ క్రికెట్‌లో ఆంధ్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ తన బౌలింగ్ ప్రతిభను చాటుకుంది. 2025లో జరిగిన ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఆమెను రూ.55 లక్షలకు తీసుకుంది. అదే ఏడాది భారత జాతీయ జట్టులోకి ఎంపికైంది.** 2025 ఏప్రిల్‌లో శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో వన్డే అంతర్జాతీయ క్రికెట్‌లోకి, ఇంగ్లండ్‌పై మ్యాచ్‌తో టీ20ల్లోకి శ్రీచరణి అరంగేట్రం చేసింది. తొలి టీ20 మ్యాచ్‌లోనే 4 వికెట్లు తీసుకుని తన ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసింది. **భారత జట్టు 2025 ప్రపంచకప్ విజయంలో శ్రీచరణి ఎంతో కీలక పాత్ర పోషించింది. ముఖ్యమైన సందర్భాల్లో వికెట్లు తీస్తూ జట్టుకు ఉపయోగపడింది.** ముఖ్యంగా ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్‌లో ఆమె ప్రదర్శన ప్రాధాన్యం సంతరించుకుంది. కడప జిల్లా నుంచి భారత జాతీయ జట్టుకు చేరిన శ్రీచరణి, నేడు రాష్ట్రంలో అనేక మంది యువ క్రీడాకారిణులకు స్ఫూర్తిగా నిలిచింది.




**హిందూనగారా**
**పాఠకులకు విజ్ఞప్తి**

హిందూ నగారాలో ప్రచురించబడుతున్న వార్తలు, వ్యాసాలపై మీ అభిప్రాయాలను ఈ క్రింది ఫోన్ నెంబరుకు వాట్సప్ ద్వారా కానీ, ఫోన్ చేసి కానీ తెలుపవచ్చు. అలాగే మీ మీ ప్రాంతాలలో జరిగే హిందుత్వ ప్రాధాన్యత కలిగిన సంఘటనలను కూడా మాకు తెలియపరచవచ్చు.

మీరు ఫోన్ / వాట్సప్ చెయ్యవలసిన నెంబర్ : 8333812685

# రేషన్ కోసం వెళ్తుండగా దారిలో దొరికిన గెలుపు!

హర్యానాలోని సంగత్పుర గ్రామంలో చిన్న గదిలా ఉండే ఇంటి నుండి సుదేశ్ దేవి, రేషన్ దుకాణానికి బయలుదేరింది. ఇంతలో అంకెలు సరిగా కనబడని కీప్యాడ్ మొబైల్ ఒక్కసారిగా మోగడం మొదలైంది. ఫోన్ వచ్చింది తెలియని నంబర్ నుంచి. ఎవరో ఏమో? అనుకుంటూ ఫోన్ ఎత్తగా, **"నీరూ గోల్డ్ జీత్ హై, ఏష్యాడ్ మే.. (నీరూ ఆసియా క్రీడల్లో బంగారు గెలిచింది)"** అని పలికింది ఓ అపరిచిత స్వరం. సుదేశ్ దేవి నడవడం ఆపి, ఆశ్చర్యంతో నిలబడిపోయింది. కూతురు బంగారు గెలిచిందా అని ఖరారు చేసుకోవడానికి టివి ఉన్న ఇల్లు ఎక్కడుందా అని ఆమె కళ్ళు వెతికాయి. 'మా ఇంట్లో టివి లేదు, స్మార్ట్ ఫోన్ కూడా లేదు. అందువల్ల పోటీలో కూతురి కథ ఏమైందన్నది చూడటానికి వీలు కాలేదు" అని సుదేశ్ దేవి మీడియాకు తెలిపింది. జపాన్‌లోని నగోయాలో వర్షంతో తడిసిన షూటింగ్ స్థలంలో ఆమె కూతురు నీరూ ధాండ, తల్లి కలను నిజం చేసింది. వ్యక్తిగత ట్రాప్ షూటింగ్ విభాగంలో బంగారు పతకం గెల్చిన మొదటి భారతీయ మహిళ నీరూ. 1978లో రణధీర్ సింగ్ తర్వాత ఈ విజయం సాధించిన మొదటి భారతీయురాలు. బియ్యం కోసమో, గోధుమల కోసమో రేషన్ అంగడి ముందు వరుసలో నిలబడే ఎందరో ఈ దేశపు తల్లులకు ఇలాంటి ఆనందక్షణాలు దొరకాలి.



## 300 ఏళ్ల తర్వాత రామప్ప ఆలయంలో రుద్రేశ్వరుడికి పూర్తిస్థాయి జలాభిషేకం!

తెలంగాణ రాష్ట్రం ములుగు జిల్లాలోని ప్రఖ్యాత రామప్ప దేవాలయంలో దాదాపు 300 సంవత్సరాలుగా నిలిచిపోయిన పూర్తిస్థాయి నిత్యజలాభిషేకం మళ్లీ ప్రారంభమైంది.



గర్భగుడిలో కొలువుదీరిన రుద్రేశ్వరస్వామికి సంపూర్ణ అభిషేకాలు చేసేందుకు మార్గం సుగమమైంది. 17వ శతాబ్దంలో సంభవించిన భూకంపం కారణంగా గర్భగుడి నుంచి అభిషేక జలాలు బయటకు వెళ్లే 'సోమసూత్రం' మూసుకుపోయింది. దీంతో ఇన్ని శతాబ్దాలుగా స్వామివారికి పరిపూర్ణ అభిషేకాలు నిర్వహించడం సాధ్యపడలేదు. ఈ నేపథ్యంలో పురావస్తు శాఖ, దేవాదాయ శాఖ అధికారులు పునరుద్ధరణ పనులు చేపట్టి, అడ్డంకులను తొలగించడంతో సోమసూత్రం తిరిగి వినియోగంలోకి వచ్చింది.

## అయోధ్య తరహాలో మథుర-బృందావన్ అభివృద్ధి

మథుర-బృందావన్ రూపురేఖలను మార్చి అత్యంత రమణీయంగా తీర్చిదిద్దేందుకు రంగం సిద్ధమవుతోంది. దీనికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం రూ.1,051 కోట్ల ప్రణాళికను రూపొందించింది. ఇందులో రూ. 540 కోట్ల విలువైన 62 ప్రాజెక్టులను ఇప్పటికే ప్రారంభించారు. మరో 167 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. కృష్ణాష్టమి పర్వదినాన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ శ్రీకృష్ణ జన్మభూమి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఈ భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు.అయోధ్య, కాశీ తరహాలోనే మధుర-బృందావన్‌లో కూడా అత్యంత ఘనంగా ఆలయ సముదాయాలను నిర్మించనున్నట్లు ప్రకటించారు.



# గిరిజన యువతకు ఏఐ శిక్షణ

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గిరిజన యువతను ఆధునిక సాంకేతిక రంగాల్లో తీర్చిదిద్దేందుకు 'ఆరోహణ ఏఐ ఫెలోషిప్'కు శ్రీకారం చుట్టారు. చింతపల్లి యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని ఐటీడీఏ పాడేరు ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆదిత్య వర్మ ప్రారంభించారు. తొలి బ్యాచ్‌లో భాగంగా 50 మంది గిరిజన విద్యార్థులను ఎంపిక చేశారు. వీరికి ఉచిత బోర్డింగ్, లాడ్జింగ్ సదుపాయాలతో రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ అందించనున్నారు. ఈ శిక్షణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ స్కిల్స్, డేటా అనలిటిక్స్, సమస్య పరిష్కార నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై విద్యార్థులకు ప్రాక్టికల్ అవగాహన కల్పించనున్నారు. ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసం, పరిశ్రమ నిపుణుల మార్గదర్శకత్వం, ప్రాక్టికల్ సెషన్లు, కెరీర్ గైడెన్స్ ద్వారా విద్యార్థులను సాంకేతిక రంగానికి సిద్ధం చేయనున్నారు. గిరిజన ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించడం ద్వారా భవిష్యత్ ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు నూతన ఆవిష్కరణలకు వారిని సంసిద్ధులను చేయడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.



# దక్షిణ కాశీ... కుండలేశ్వర స్వామి ఆలయం

**పా**ర్వతీ సమేత కుండలేశ్వర స్వామి ఆలయం పవిత్ర గోదావరి నదీ తీరాన వెలసింది. 'కుండలీకృత కుండలేశ్వర కుండలం వృషవాహనం' అంటూ చంద్రశేఖరాష్టకంలో మార్కండేయ మహర్షి ఈ ఆలయాన్ని స్తుతించారంటే ఆయనకు పూర్వం నుంచి ఉన్న అతి ప్రాచీన దేవాలయం ఇది. కాశీ క్షేత్రానికి ఎంతటి ప్రాముఖ్యత ఉందో అంతటి ప్రాముఖ్యత ఈ క్షేత్రానికి కూడా ఉండడం వల్ల దీన్ని దక్షిణ కాశీగా వ్యవహరిస్తారు. ఇక్కడ పరమేశ్వరుడు స్వయంభూ శివలింగంగా వెలసి ఉన్నాడు. ఇక్కడి శివలింగం చెవి కుండలాల ఆకారంలో ఉండటం వల్ల ఈ స్వామిని కుండలేశ్వర స్వామిగా పిలుస్తారు. కోనసీమ జిల్లాలోని కాట్రేనికోన మండలం, కుండలేశ్వరం గ్రామంలో "వృద్ధగౌతమి" తీరాన ఈ ఆలయం ఉంది. **స్కంద పురాణంలో వివరించిన ప్రకారం కాశీ యాత్రకు వెళ్లేవారు ముందుగా వృద్ధ గౌతమిలో స్నానం చేసి కుండలేశ్వరుని దర్శించుకుని అపుడు కాశీకి బయలుదేరాలట. ఈ క్షేత్రం అంతటి ప్రశస్తమైనది.** శివుని ఆజ్ఞ మేరకు కాశీని విడిచి పెట్టాల్సి వచ్చిన వ్యాస మహర్షి విశ్వేశ్వరుని దర్శించుకోలేని తన దురవస్థకు చింతిస్తూ ఆ దుఃఖోపశమనం కోసం అనేక దివ్యధామాలు దర్శించుకుంటున్న తరుణంలో కుండలేశ్వరం వచ్చాడు. దక్షయజ్ఞం తరువాత యోగాగ్నిలో దగ్ధమైన సతీదేవి చెవి కుండలం పడిన ఈ క్షేత్రంలో గోదావరి స్నానం చేసి కుండలేశ్వర స్వామిని దర్శించిన తరువాత వ్యాసుడు కాశీ విశ్వనాథుని దర్శించుకున్న అనుభూతిని పొందారు. **భారతదేశంలో ప్రవహించే ప్రతి నదికీ 12 సంవత్సరాలకు**



**ఒకసారి పుష్కరాలు వస్తాయి. కానీ ఇక్కడి వృద్ధ గౌతమి నదికి మాత్రం ప్రతిరోజూ పుష్కరాలే అని వ్యాస మహర్షి వరం ప్రసాదించాడు! ఈ క్షేత్రంలోని గోదావరి నదిలో ఏ రోజైనా స్నానం చేసిన వారికి పుష్కర స్నాన ఫలం వస్తుందని అనుగ్రహించాడు.** ప్రజలంతా కాశీ వెళ్లి గంగానదిలో స్నానం చేసి పాపాలు తొలగించుకుంటారు. వారందరి పాపాలతో కలుషితమైన గంగమ్మ రోజూ రాత్రి పూట వచ్చి ఇక్కడ గోదావరిలో స్నానం చేసి తన పాపాలను తొలగించుకుని వెళ్తుందని చెబుతారు. కుండలేశ్వరుని సేవించుకునే సమయంలో దేవతలు వేదపారాయణ చేస్తారట. ఈ క్షేత్రంలో ప్రశాంతంగా కూర్చుని ధ్యానం చేసుకోగలిగితే మనకు కూడా ఈ వేదఘోష ఇప్పటికీ వినబడుతుందని భక్తుల విశ్వాసం.

**ఎన్.ఎస్.కె.చక్రవర్తి**

---

# పోషకాల పండ్లతో ప్రయోజనాలెన్నో!

**ఉసిరిక:** అమలకి అని పిలిచే ఉసిరికలో విటమిన్-సి అత్యధికంగా ఉంటుంది. చ్యవనప్రాశ, అమలకీ రసాయనం వంటి ఔషధాల్లో ఉసిరికను ఉపయోగిస్తారు. ఉసిరిక, వేయించిన జీలకర్ర, ఎండు గులాబీ రెక్కలు, నల్ల ఉప్పు చూర్ణాలను సమభాగంగా కలిపి చెంచా ప్రమాణంలో ఒక చెంచా చొప్పున రోజుకు రెండుసార్లు సేవిస్తే కడుపు ఉబ్బరం, ఆకలి లేకపోవడం, పులిత్రేన్పులు తగ్గుతాయి. ఈ పొడిని పసుపు పొడి కషాయంలో బాగా నూరి ముద్దగా చేసి రోజూ ఉదయం, సాయంత్రం ఒక గ్రాము తీసుకొంటే ఇన్సులిన్ ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుంది. కాళ్ల మంటలు తగ్గుతాయి.



**నేరేడు:** దీని శాస్త్రీయ నామం యూజీనియా జాంబోలోనా. ఈ పండులో శరీరానికి అవసరమైన క్యాల్షియం, ఐరన్, మెగ్నీషియం, భాస్వరం, పొటాషియం, సల్ఫర్ ఉంటాయి. ఇవి రక్తపోటును తగ్గించడంలో సహాయపడతాయి. కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తాయి. గుండెకు మేలు చేస్తాయి. కంటి చూపును మెరుగుపరుస్తాయి. కీళ్ల నొప్పులను నివారిస్తాయి. జుట్టు కుదుళ్లు దృఢంగా మారతాయి. నేరేడు లేత ఆకుల కషాయాన్ని తేనె లేదా మజ్జిగతో తీసుకోడం వల్ల వంధ్యత్వం, తరచూ అయ్యే అబార్షన్ ప్రమాదాలను నివారిస్తుంది. దీని విత్తనాల పొడి మధుమేహ నియంత్రణలో ఉపయోగపడుతుంది జాంబవాసవ నేరేడు పండ్లతో తయారవుతుంది.

**దానిమ్మ:** ఎర్రగా నిగనిగలాడుతూ కంటికి ఇంపుగా కనిపించే దానిమ్మ గింజలు ఆరోగ్యానికి అనేక విధాలుగా ప్రయోజనం కలిగిస్తాయి. ఈ పండులోని ఇల్లాజిక్ యాసిడ్‌ను చర్మంపై రాస్తే సూర్యకిరణాల ప్రభావం నుంచి రక్షిస్తుంది. అత్యంత శక్తిమంతమైన యాంటీఆక్సిడెంట్ల సమాహారం దానిమ్మ. అల్జీమర్స్, వక్షోజ క్యాన్సర్, చర్మ క్యాన్సర్లను అడ్డుకుంటుంది. రోజూ పావు కప్పు దానిమ్మ రసం తాగితే గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఆస్టియో ఆర్థ్రయిటిస్‌తో బాధపడేవారికి అత్యంత రుచికరమైన మందు దానిమ్మ పండు, రసం.

**రామ శర్మ**

# పాములవారు.. సంచార జీవనానికి, సంప్రదాయ జ్ఞానానికి వారధులు

**భా**రతీయ సామాజిక చరిత్రలో సంచార సమాజాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సంచరిస్తూ తమ వృత్తిని, కళలను, సంప్రదాయ జ్ఞానాన్ని తరతరాలుగా కొనసాగించిన సమాజాల్లో పాములవారు ఒకరు. పాములతో ముడిపడిన జీవన విధానం, పుంగి నాదం, ప్రత్యేక వేషధారణ, పాముల ప్రవర్తనపై తరతరాల అనుభవం వీరికి ప్రత్యేక గుర్తింపును తెచ్చాయి. వీధిలో పుంగి నాదం వినిపించగానే భుజాన బుట్టతో పాములవారు కనిపించడం ఒకప్పుడు గ్రామీణ జీవితంలో సాధారణ దృశ్యం. బుట్టలోని పాము పడగ విప్పడం పిల్లలకు ఆసక్తిని, పెద్దలకు ఆశ్చర్యాన్ని కలిగించేది. ఇది కేవలం వినోదం మాత్రమే కాదు. ఏ పాము విషపూరితమైనది, పాములు ఎక్కడ నివసిస్తాయి, వాటి కదలికలను ఎలా గుర్తించాలి వంటి విషయాలపై వారికి తరతరాలుగా అనుభవపూర్వక పరిజ్ఞానం ఉండేది. కొన్ని ప్రాంతాల్లో ఇళ్లలోకి, పొలాల్లోకి వచ్చిన పాములను



వట్టేందుకు కూడా వీరిని ఆశ్రయించేవారు. **పాముకు భారతీయ సంస్కృతిలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాధాన్యం ఉంది. నాగారాధన, శివునితో ఉన్న అనుబంధం వంటి విశ్వాసాల మధ్య పాములవారి జీవితం కొనసాగింది.** ఊరు జాతరలు, పండుగల్లో వీరి ప్రదర్శనలు ప్రజలతో మమేకమయ్యే ఒక సంప్రదాయంగా ఉండేవి. పుంగి నాదానికి పాము నాట్యం చేస్తుందనే భావన ఉన్నప్పటికీ, శాస్త్రీయంగా పాము సంగీతానికి నాట్యం చేయదు. పుంగి వాయించే వ్యక్తి కదలికలను గమనిస్తూ పాము శరీరాన్ని కదుపుతుంది.

కాలక్రమంలో వన్యప్రాణి సంరక్షణపై అవగాహన పెరిగింది. పాములను పట్టడం, బంధించడం, ప్రదర్శించడంపై చట్టపరమైన నియంత్రణలు వచ్చాయి. దీని ప్రభావం పాములవారి కుటుంబాలపైనా ప్రభావం పడింది. పాములవారి అభ్యున్నతి అంటే పాత వృత్తిని కొనసాగించడమే కాదు. వారి పిల్లలకు విద్య, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించాలి. పాముల గురించి వారి వద్ద ఉన్న అనుభవ జ్ఞానంలోని ఉపయోగకరమైన అంశాలను శాస్త్రీయంగా నమోదు చేయాలి. **ఒకప్పుడు పాములవారి చేతిలో కనిపించిన బుట్ట, పుంగి వారి జీవనానికి ప్రతీకలు. కానీ వారి పిల్లల చేతుల్లో బుట్ట స్థానంలో పుస్తకం, పుంగి స్థానంలో విద్య, నైపుణ్యం, స్వావలంబన ఉండాలి.** వారి గతాన్ని గౌరవిస్తూనే.. భవిష్యత్తుకు కొత్త మార్గాలను చూపించడమే నిజమైన అభ్యున్నతి.

# శుద్ధి పరికరం... చిన్న రైతుకు చేదోడు



**రై**తులు పండించిన ధాన్యం అమ్ముకోవడానికి, దానిలో ఉన్న చెత్తను, చిన్న మట్టి ముద్దలను వేరు చేయడానికి ఈ పరికరం ఉపయోగపడుతుంది. కూలీల సహాయంతో పంటను శుభ్రం చేసిన తర్వాత రైతులు తాము పండించిన పంటను అమ్ముకుంటారు. ప్రస్తుతం కూలీల ఖర్చులు బాగా పెరిగిపోయిన నేపథ్యంలో ఈ పరికరం ద్వారా ఎవరికివారు తేలికగా శుభ్రం చేసుకోవచ్చు. వేరుశెనగ, శనగ, పెసర, మినుము, కంది పంటలను ఈ పరికరం ఉపయోగించి శుద్ధి చేసుకుని రైతులు విక్రయించుకోవచ్చు.

**పరికరం తయారీ ఇలా...** ముందుగా ఒక చిన్న చక్రం, పెద్ద చక్రం సిద్ధం చేసుకోవాలి. ఈ రెండింటినీ ఒక బెల్ట్ ద్వారా అనుసంధానం చేయాలి. చిన్న చక్రానికి పెడల్ అమర్చడం ద్వారా పెడల్ మార్గం ద్వారా పెద్ద చక్రానికి అనుసంధానం చేసిన జల్లెడ తిరుగుతుంది. ఇలాంటి జల్లెడలు వేర్వేరు పరిమాణాల్లో చేసుకొని పెద్ద చక్రానికి అమరిస్తే... ఏ సైజు గింజలు ఆ జల్లెడలో పడతాయి. ఈ విధంగా ధాన్యాన్ని శుభ్రం చేసుకోవచ్చు. ఇంకా మన ఇళ్లలో కందిపప్పు, బియ్యం నుంచి చిన్న రాళ్లను సులభంగా వేరు చేసుకోవచ్చు. ఈ పరికరంపై ఆసక్తి ఉన్నవారు శ్రీ ఆంజనేయ స్మాల్ అగ్రిటూల్స్ డైరెక్టర్, రైతునేస్తం ప్రొఫెసర్ ముప్పా లక్ష్మణ్ రావును (సెల్ నం. 9849140465) సంప్రదించవచ్చు.

# హిమాలయాల రక్షణకు బోర్డు: సద్గురు

**హి**మాలయ ప్రాంతాల్లో విపత్తులను ఎదుర్కోవడంతో పాటు పర్వతాల పరిరక్షణకు భారత్, చైనా, పాకిస్థాన్, నేపాల్, భూటాన్‌లతో కూడిన 'హిమాలయ బోర్డు' ఏర్పాటు చేయాలని ఆధ్యాత్మిక గురువు సద్గురు జగ్గీ వాసుదేవ్ పిలుపునిచ్చారు. **"పర్వతాలకు మీ రాజకీయాలు తెలియవు. మీరు మాట్లాడే భాష కూడా పర్వతాలకు తెలియదు. హిమాలయ ప్రాంతం భూమిపై అత్యంత అద్భుతమైన, అదే సమయంలో అత్యంత సున్నితమైన ప్రాంతాల్లో ఒకటి. వాటి పరిరక్షణ కోసం హిమాలయాలు విస్తరించి ఉన్న దేశాలన్నింటితో కూడిన సంస్థను ఏర్పాటు చేయడం తక్షణ అవసరం" అని సద్గురు అన్నారు.**



# దసరా వైభవం... తరతరాల సాంస

మన దేశంలో దసరా ఒక్కటే.. కానీ దాన్ని జరుపుకునే సంప్రదాయాలు మాత్రం ఎన్నో. మైసూర్ రాజసం నుంచి కుల దేవతల సమ్మేళనం వరకు.. కోల్‌కతా దుర్గాపూజ నుంచి వారణాసి రామ్‌లీలా వరకు.. విజయవాడ కనకదుర్గమ్మ నవరాత్రుల నుంచి తెలంగాణ బతుకమ్మ వరకు.. ప్రతి ప్రాంతం తన సంస్కృతి, విశ్వాసం, జానపద సంప్రదాయాలతో దసరాకు ఓ ప్రత్యేక రూపాన్ని ఇచ్చింది. దసరా పండుగ వచ్చిందంటే చాలు.. సంబరాలు అంబరాన్ని తాకుతాయి. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో తరహాలో కనీవినీ ఎరుగని స్థాయిలో విజయదశమి వేడుకలు నిర్వహిస్తారు. నవరాత్రులు పేరుతో నిర్వహించే ప్రతి వేడుకకు ఓ ప్రత్యేకత ఉంటుంది. అందుకే దసరా ఒక పండుగ మాత్రమే కాదు.. భారతీయ సంస్కృతిని, సంప్రదాయాలను, విశ్వాసాలను కలుపుతూ తరతరాలకు అందిస్తున్న ఓ గొప్ప సాంస్కృతిక వారసత్వం.

## విజయవాడలో కనకదుర్గమ్మ నవరాత్రులు



ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ శరన్నవరాత్రుల్లో తొమ్మిది రోజుల పాటు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిస్తారు. ముఖ్యంగా మూలా నక్షత్రం రోజున సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా భక్తులు తరలివస్తారు. విజయదశమి రోజున కృష్ణానదిలో జరిగే హంస వాహన తెప్పోత్సవం ప్రధాన ఆకర్షణ. ఆధ్యాత్మికతతో పాటు విజయవాడ ఉత్సవ్, సాంస్కృతిక కార్యక్రమాలు, సరస్ మేళా మరింత శోభను తీసుకొస్తాయి.

## ఒంగోలులో కళారాల ఊరేగింపు



ఒంగోలు దసరా ఉత్సవాల్లో కళారాల ప్రదర్శన ప్రత్యేకంగా నిలుస్తుంది. కాళీదేవి, మహిషాసురమర్దిని, నరసింహస్వామి వంటి దేవతా రూపాలతో కళారాలను తయారు చేసి.. నవరాత్రుల్లో రోజుకొకటి చొప్పున ఊరేగిస్తారు. చివరి రోజున వీటిని ఊరి మధ్యకు తీసుకొచ్చి రాక్షస సంహారం ఘట్టాన్ని ప్రదర్శిస్తారు.

## మచిలీపట్నంలో శక్తి పటాల ఊరేగింపు



మచిలీపట్నం దసరాలో శక్తి పటాల ఊరేగింపు ప్రత్యేక ఆకర్షణ. తొమ్మిది రోజుల పాటు బందరు పురవీధుల్లో వివిధ రూపాల్లో శక్తి పటాలను ఊరేగిస్తారు. భక్తులు వీటిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తారు. చివరి రోజున కోనేరు సెంటర్ వద్ద జమ్మి కొట్టడంతో ఉత్సవాలు ముగుస్తాయి. శక్తి ఆరాధన, జమ్మి పూజతో ముడిపడిన ఈ సంప్రదాయం బందరు ప్రాంత దసరా సంస్కృతికి ప్రత్యేక గుర్తింపును తెచ్చింది.

## వీరవాసరం.. ఏనుగుల సంరంభం



పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరంలో వెదురు కర్రలు, గడ్డి, కొబ్బరి పీచుతో భారీ ఏనుగు ఆకారాన్ని తయారు చేస్తారు. దానికి అంబారీని అందంగా అలంకరిస్తారు. భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. ఏనుగు కింద పిల్లలను దాటిస్తే ఆరోగ్యం, రోగాల నుంచి రక్షణ లభిస్తుందనే విశ్వాసం ఈ వేడుకతో ముడిపడి ఉంది.

## విజయనగరం.. పైడితల్లి సిరిమానోత్సవం



విజయనగరం దసరా ఉత్సవాల్లో పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం ప్రధాన ఆకర్షణ. గజపతుల కాలం నుంచి ఈ సంప్రదాయం కొనసాగుతున్నట్లు స్థానికంగా విశ్వసిస్తారు. దసరా సందర్భంగా పూజారిని సిరిమానుపై కూర్చోబెట్టి.. ఆలయం నుంచి కోట వరకు మూడుసార్లు ఊరేగిస్తారు. ఈ సిరిమానును దర్శించేందుకు విజయనగరంతో పాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి కూడా భారీగా భక్తులు తరలివస్తారు. సిరిమానోత్సవం తర్వాత జరిగే జాతర కూడా ఈ వేడుకలో ముఖ్య భాగంగా ఉంటుంది.

## దేవరగట్టు.. బన్ని ఉత్సవం



కర్నూలు జిల్లా దేవరగట్టులో జరిగే బన్ని ఉత్సవం అత్యంత ప్రత్యేకమైన దసరా సంప్రదాయాల్లో ఒకటి. దసరా రాత్రి వివిధ గ్రామాల ప్రజలు జట్లుగా ఏర్పడి ఉత్సవ విగ్రహాలను దేవరగట్టు ఆలయానికి తీసుకెళ్లేందుకు పోటీ పడతారు. ఈ సందర్భంగా కర్రలతో కొట్టుకొనే సంప్రదాయం ఉండటంతో దీనిని 'కర్రల సమరం' అని కూడా అంటారు.

# సాంస్కృతిక వారసత్వం





## మైసూరులో నాలుగు శతాబ్దాల వైభవం

కర్ణాటకలోని మైసూరు దసరా ఉత్సవాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది. 400 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ వేడుకలను 'నాడ హబ్బ'గా పిలుస్తారు. ఈ పండుగ సందర్భంగా చాముండేశ్వరీ దేవిని ప్రత్యేకంగా పూజించడం ఇక్కడి ప్రధాన ఆచారం. పది రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో మైసూరు ప్యాలెస్, చాముండీ కొండ దీపకాంతులతో మెరిసిపోతాయి. జంబూ సవారీ ప్రత్యేక ఆకర్షణ.

## కోల్‌కతా బాగ్‌బజార్ దుర్గా పూజ



కోల్‌కతాలోని ప్రసిద్ధ బాగ్‌బజార్ సర్బోజోనిన్ దుర్గా పూజకు వందేళ్లకు పైగా ఘనమైన చరిత్ర ఉంది. ఉత్తర కోల్‌కతాలోని హుగ్లీ నది సమీపంలో జరిగే ఈ వేడుక.. బెంగాలీ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తోంది. సాధారణ ప్రజల భాగస్వామ్యంతో 1919లో ఈ పూజ.. ప్రారంభమైంది. ఇప్పటికీ ఆధునిక థీమ్‌లకు భిన్నంగా సంప్రదాయ శైలిలో, డాకర్ సాజ్ అలంకరణతో దుర్గాదేవిని కొలవడం బాగ్‌బజార్ పూజ ప్రత్యేకత. భక్తి, చరిత్ర, కళ, బెంగాలీ సంస్కృతి కలగలిసిన ఈ వేడుక.. కోల్‌కతా దుర్గా పూజ వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది.



## తెలంగాణలో బతుకమ్మ పాటలు

తెలంగాణలో నవరాత్రుల వేళ పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలు పాటలు పాడుతూ, బతుకమ్మ చుట్టూ నృత్యాలు చేయడం దసరా సంబరాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. చివరి రోజు సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించి బతుకమ్మలను చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేస్తారు. విజయదశమి రోజున జమ్మి పూజ మరో ముఖ్యమైన సంప్రదాయం. జమ్మి ఆకులను బంగారంగా భావించి ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకుంటూ శుభాకాంక్షలు చెప్పుకోవడం ఆనవాయితీ. అదే విధంగాపాలపిట్టను చూడటం విజయానికి, శుభానికి సంకేతంగా భావిస్తారు. తెలంగాణ దసరాలో అలయ్-బలయ్‌కూడా ప్రత్యేకమైన సామాజిక సంప్రదాయం. దసరా సందర్భంగా బంధుమిత్రులు, వివిధ వర్గాల ప్రజలు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని కలిసి భోజనం చేస్తారు.

## ఇతర రాష్ట్రాల్లోనూ సందడి...

దేశవ్యాప్తంగా జరిగే దసరా ఉత్సవాల్లో ఢిల్లీ రామ్‌లీలాకు ప్రత్యేక స్థానం ఉంది. నవరాత్రుల తొమ్మిది రోజుల పాటు రామాయణంలోని ముఖ్య ఘట్టాలను నాటిక రూపంలో ప్రదర్శించడం ఇక్కడి సంప్రదాయం. శతాబ్దాలుగా కొనసాగుతున్న ఈ రామ్‌లీలా కళారూపానికి అంతర్జాతీయ గుర్తింపు కూడా లభించింది.

- ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ దసరా ఉత్సవాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇతర ప్రాంతాల్లో దసరా పది రోజులు జరుపుకుంటే.. బస్తర్‌లో మాత్రం ఈ వేడుకలు సుమారు 75 రోజుల పాటు కొనసాగుతాయి. దంతేశ్వరీ దేవికి అంకితమైన ఈ ఉత్సవాల్లో స్థానిక గిరిజన సంప్రదాయాలు, ఆచారాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి.
- వారణాసిలో నవరాత్రి రోజుల్లో నవదుర్గ ఆలయాల దర్శనం, గంగా ఘాట్‌లపై ప్రత్యేక హారతులు భక్తులను ఆకట్టుకుంటాయి.
- దేశవ్యాప్తంగా విజయదశమితో దసరా ముగుస్తుంటే.. హిమాచల్‌ప్రదేశ్‌లోని కులు లోయలో మాత్రం అదేరోజున ప్రారంభమై ఏడు రోజుల పాటు వైభవంగా సాగుతుంది. దాదాపు 375 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఉత్సవానికి అంతర్జాతీయ మెగా ఫెస్టివల్‌గా గుర్తింపు ఉంది. ప్రధాన దైవమైన రఘునాథ్ జీని భారీ చెక్క రథంపై ప్రతిష్ఠించి భక్తులు లాగే రథయాత్ర ప్రధాన ఆకర్షణ. చివరి రోజున బియాస్ నది ఒడ్డున లంకా దహనం నిర్వహించి ఉత్సవాలకు ముగింపు పలుకుతారు.

## అహ్మదాబాద్‌లో దాండియా సందడి

గుజరాత్‌లోని అహ్మదాబాద్ భక్తి, జానపద సంస్కృతి, ఉత్సాహం కలగలిసిన దసరా వేడుకలకు ప్రసిద్ధి. నవరాత్రుల సందర్భంగా గార్బా, దాండియా నృత్యాలతో నగరం సందడిగా మారుతుంది. సంప్రదాయ దుస్తుల్లో యువత, మహిళలు చేసే గార్బా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. భదాజ్‌లోని హరే కృష్ణ మందిరంలో రాధా మాధవుల రథోత్సవం, ప్రత్యేక భజనలు, శ్రీరామ తారక మహా యజ్ఞం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకుంటాయి.



## హైందవంపై మకిలిని తుడిచిన యోగివర్యుడు

**ము**మ్మిడివరం బాలయోగిగా ప్రసిద్ధులైన సుబ్బారావు, కోనసీమ జిల్లా అమలాపురం దగ్గర ముమ్మిడివరం గ్రామంలో కటికదల గంగయ్య, రామమ్మ అనే హరిజన దంపతులకు 1930 అక్టోబరు 30న జన్మించారు. పదేళ్ళ వయసులో ఆవుల కాపరి పనిలో చేరారు. పదహారేళ్ళకే ఓ కొబ్బరిచెట్టు కింద కృష్ణ నారదులు ఉన్న చిత్రపటం ముందుంచుకుని తపస్సు మొదలుపెట్టారు. కొన్నాళ్ళ తరువాత బాలుడు చూపించిన స్థలంలో అతని తండ్రి చిన్న పాక కట్టారు. అప్పటినుంచీ అక్కడే అన్నపానాదుల ధ్యాస లేకుండా నలభై ఏళ్ళపాటు తపస్సు చేశారు. భక్తుల తాకిడి ఎక్కువ కావడంతో పాకకు తలుపులు పెట్టించి తాళం వేయించుకున్నారు. **భక్తుల కోరిక మేరకు ఏడాదికి ఒక్కసారి, శివరాత్రి మరునాడు దర్శనం ఇచ్చేవారు. ఆ మహనీయుడి దర్శనం కోసం శివరాత్రికి రెండుమూడు రోజుల ముందునుంచీ సుమారు 15 లక్షల మంది భక్తులు వచ్చేవారు.** విదేశాల నుంచి కూడా చాలామంది వచ్చి బాలయోగిని దర్శించుకునేవారు. **పౌమీ లెస్కార్ట్ అనే ఫ్రెంచ్ బ్యాలే నాట్యకళాకారిణి ప్రతీ సంవత్సరమూ వచ్చి బాలయోగిని దర్శించుకునేవారు. ఆమె బాలయోగి గురించి ఫ్రెంచ్‌భాషలో పుస్తకం రాశారు. అనంతరకాలంలో ముమ్మిడివరంలో బాలయోగి పాలరాతి విగ్రహాన్ని చేయించి దర్శన మందిరంలో ప్రతిష్ఠించినది కూడా ఆమే.** బాలయోగి 1985 జులై 19న ఆయన కైవల్యసిద్ధి పొందిన తర్వాత ప్రముఖ కవి బోయి భీమన్న 'బాలయోగీయం' అనే కావ్యం రచించారు. అందులో బాలయోగి చేసిన **యోగదీక్ష ఆశయాలను వివరించారు. వాటిలో ప్రధానమైనవి... (1) ఇతర మతాల ప్రచారానికి భయపడి ఆధునిక విద్యావంతులు, యువకులు విగ్రహారాధన పట్ల చూపుతున్న నిరసన భావాన్ని తొలగించడం. (2) తాను పుట్టిన వర్గానికి కులం కారణంగా సంక్రమించిన దాస్యాన్ని తొలగించి, హైందవ జాతిలో సాంఘిక సమానత్వాన్ని సాధించడం, అనాదిగా వస్తున్న తన ఆధ్యాత్మిక వారసత్వాన్ని నిరూపించడం (3) జీవ బ్రహ్మైక్యాన్ని సాధించిన మహాయోగి ఎంతకాలమైనా నిరాహారిగా బతకగలడని ఋజువు చేయడం (4) బ్రహ్మపథంలో హరి నాభికమలంలోని మధుకోశంలో జీవరహస్యం దాగి ఉన్నదని నిరూపించడం (5) తన యోగశక్తిని భారతీయ సమైక్యత కోసం, విశ్వ మానవ శ్రేయస్సు కోసం వినియోగించడం (6) వ్యక్తిగత మోక్షం సాధించాలనే స్వార్థం లేకపోవడం.**



**(అక్టోబరు 23... ముమ్మిడివరం బాలయోగి జయంతి)**

## హిందూ మహిళల జాగృతే లక్ష్యం

**హిం**దువుల సమైక్యత, సముద్ధరణే లక్ష్యంగా డాక్టర్ కేశవరావు బలీరామ్ హెడ్గేవార్ 1925 విజయదశమి నాడు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సంస్థను ప్రారంభించారు. దేశానికి ఆంగ్లేయుల నుంచి స్వాతంత్ర్యం రావడం ఎంత ముఖ్యమో, హిందువుల్లో చైతన్యం కలగడమూ అంతే ముఖ్యం అనే భావనతో ఆర్ఎస్ఎస్ ఏర్పడింది. అదే ప్రేరణతో హిందూ మహిళలను కూడా సముద్ధరించాలన్న సత్సంకల్పంతో రాష్ట్ర సేవికా సమితి ఏర్పడింది. **మహారాష్ట్రకు చెందిన విద్యావేత్త లక్ష్మీబాయి కేల్కర్ 1936 అక్టోబర్ 25న విజయదశమి పర్వదినం నాడు వార్ధాలో 'రాష్ట్ర సేవికా సమితి' సంస్థను ప్రారంభించారు. రాష్ట్ర సేవికా సమితి సంఘం ప్రోత్సాహంతో ఏర్పడిన పూర్తి స్వాతంత్ర్యం కలిగిన సంస్థ.** హిందూ మహిళలను జాగృతం చేయడం, వారిని సశక్తులను చేయడం, దేశ నిర్మాణంలో కీలక భూమిక పోషించడంపై దృష్టి సారించే సంస్థ. **సేవికా సమితికి మూడు ప్రధాన ఆదర్శాలు ఉన్నాయి. మొదటిది మాతృత్వం, అంటే తల్లిగా వ్యవహరించడం. రెండవది కర్తృత్వం, అంటే సమర్థతతో సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం, మూడవది నేతృత్వం, అంటే నాయకత్వం వహించడం.** కుటుంబానికి, దేశానికి ప్రేరణనిచ్చే శక్తి మహిళే. ఆ శక్తిని జాగృతం చేయనంత వరకూ సమాజం అభివృద్ధి చెందజాలదు అని లక్ష్మీబాయి స్పష్టంగా భావించారు. ఆర్ఎస్ఎస్‌ను స్థాపించిన విజయదశమి నాడే సేవికా సమితి కూడా ప్రారంభం అవడం యాదృచ్ఛికం కాదు. **హిందూ మహిళా సంఘటన లక్ష్యంగా, స్త్రీ స్వ సంరక్షణ, క్షమత ఉద్దేశ్యంగా, తేజస్వి హిందు రాష్ట్ర పునర్నిర్మాణం ధ్యేయంగా పని చేస్తున్న సంస్థగా సేవికా సమితి ప్రఖ్యాతి గడించింది. అందుకే లక్ష్మీబాయిని ఆదరంగా మౌసీజీ అని పిలుచుకోవడం పరిపాటి అయింది.** సంఘంలానే రాష్ట్ర సేవికా సమితి కూడా శాఖలను నిర్వహిస్తుంది. దేశమంతా వ్యాపించి ఉన్న ఈ శాఖల్లో బాలికలు, యువతులకు యోగా, సాంస్కృతిక విలువలు, కరాటే లాంటి శారీరక శిక్షణ నేర్పిస్తారు. సమాజంలో సానుకూల సంస్కరణలు తీసుకొచ్చే సదుద్దేశంతో హిందూ మహిళలనే నాయికలుగా తీర్చిదిద్దడంపై సేవికా సమితి దృష్టి కేంద్రీకరించింది. **భారతీయ మహిళలు ఇళ్ళ నుంచి బైటకు రాని, రాలేని సామాజిక పరిస్థితులు ఉన్న కాలంలో వారిని బైటకు తీసుకువచ్చి, వారిని సంఘటితం చేసి, వారి ఐకమత్యంతో జవజీవాలు కలిగిన సంస్థగా సేవికా సమితిని మౌసీజీ తీర్చిదిద్దారు.** భారతీయ మహిళలు బలహీనులు కారనీ, శక్తిమంతులైన సేవికలనీ నిరూపించారు. సమాజ అభ్యున్నతిలో గణనీయమైన పాత్ర పోషిస్తున్నారు.

# సమాజం వారికిచ్చే గౌరవమెంత?

**నా** కళాశాల రోజుల్లో 'సామరస్య ' అనే సంస్థలో కొంతకాలం పనిచేసే అవకాశం లభించింది. సమాజంలోని కింది వర్గాలు, శోషిత వర్గాల గురించి కాసింత ఆలోచించాలని ఆ సంస్థ పుట్టుకొచ్చింది. ఒకరోజు ఆరెస్సెస్ కు చెందిన శ్రీ దత్తాత్రేయ హొసబాళె ఒక గోష్ఠి తీసుకున్నారు. అందులో ఓ విద్యార్థి ఒక ప్రశ్న వేశాడు. పౌర కార్మికులు పనికి సక్రమంగా రారు. మద్యపానం చేస్తారు. ఆరోగ్యం కాపాడుకోరు. దీన్ని సరిచేయడం ఎలా? ఆ ప్రశ్నకు దత్తాజీ అత్యంత సంవేదనాశీలతతో జవాబిచ్చారు. చూడండి.. మీరందరూ ఉదయం నుంచి రకరకాల సమావేశాల్లో పాల్గొంటున్నారు. వక్తల మాటలు వింటూ మీరు అలసిపోకూడదని, మీకు తలనొప్పి రాకూడదని నిర్వాహకులు మధ్యలో కాఫీ, తేనీరు ఇచ్చి మిమ్మల్ని



చైతన్యవంతుల్ని చేస్తున్నారు. మీ పరిస్థితే ఇలా ఉంటే, ఊరిలోని చెత్తాచెదారాన్నంతా ఊడ్చేవారికి ఆ పని ఎంత విసుగు కలిగించి ఉండవచ్చు? అయాసాన్ని, విసుగును మరచిపోవడానికి అతడు లేదా వారు తాగుడుకు అలవాటు పడి ఉండవచ్చు.దీని గురించి సమాజం ఎప్పుడైనా ఆలోచించిందా? అంతేకాదు, ఆ పని ఎంత అపాయకరమో తెలిసినా, మన ప్రభుత్వం ఇచ్చే జీతమెంత? మన సమాజం వారికిచ్చే గౌరవమెంత? వారి ఆరోగ్యం, రక్షణ గురించి మనం ఎప్పుడైనా దృష్టి పెడుతున్నామా? మద్యపానం చేయడం వాళ్ళ తప్పు అని మనమంతా చెబుతామే తప్ప, వారిని ఆ స్థాయి నుంచి పైకి తీసుకురావడానికి ఏం చేయాలో ఆలోచించడమే లేదు అన్నారు. శ్రీ దత్తాత్రేయ హొసబాళె మనముందుంచిన ఇలాంటి ప్రశ్నలకు మన వద్ద ఎలాంటి జవాబులు లేవు. ఆ క్షణం నుంచి సమాజపు ఆ అంచున ఉన్న వారి బతుకును చూసే దృష్టికోణమే మారిపోయింది.

**- వాదిరాజ్, సామరస్య**


**చందాదారులుగా చేరండి! చేర్పించండి**

**హిందూ నగారా సంవత్సర చందా రూ. 100/-**

**మీతో పాటుగా మరి కొంతమందిని**

**చందాదారులుగా చేర్పించండి.**

**UNION BANK OF INDIA**
**A/C No. 014511100004775**
**IFSC CODE: UBIN0801453**
**Governorpet Branch,**
**VIJAYAWADA**


# దశావతార పరిణామం.. విజ్ఞాన శాస్త్రం!



**వేదానుద్ధరతే జగన్నివహతే**
**భూగోళముద్బిభ్రతే,**
**దైత్యం దారయతే బలిం ఛలయతే**
**క్షత్రక్షయం కుర్వతే**
**పౌలస్త్యం జయతే హలం కలయతే**
**కారుణ్యమాతన్వతే**
**మ్లేచ్ఛాన్ మూర్ఛయతే దశాకృతికృతే**
**కృష్ణాయ తుభ్యం నమః**

**జీ**వం అనే దానికి మూలం ఏది? మనం ఎక్కడినుండి వచ్చాము? అనే ప్రశ్నలు మనిషికి నిన్నో, మొన్నో వచ్చినవి కావు. విజ్ఞాన శాస్త్రాన్ని చదివినవారు పురాణాలను కట్టుకథ అనేస్తారు. మన పురాణాలు జీవపు అనంత ప్రయణాన్ని కేవలం భౌతిక దేహపు రూపాంతరంగా చూడక, దాని వెనకున్న చైతన్యపు మహాయాత్రగా పేర్కొన్నాయి. మన పరంపర నీటిలో పుట్టిన సూక్ష్మ చైతన్యం నేల మీదికొచ్చి, కాళ్ళలో బలం సమీకరించుకుని, పశుత్వాన్ని కోల్పోయి, నాగరికంగా పెరిగింది. తర్వాత ఆత్మ సాక్షాత్కారం వైపుకు సాగిపోయింది. **తైత్తిరియోపనిషత్తులో 'తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశః సంభూతః ఆకాశాద్వాయుః వాయోరగ్నిః అగ్నేరాపః అద్భ్యః పృథివీ పృథివ్యా ఓషధయః ఓషధీభ్యోన్నమ్ అన్నాత్పురుషః' అనే మంత్రం ఉంది. పరమాత్ముడి నుంచి ఆకాశం, దానినుంచి వాయువు, దానినుంచి అగ్ని, అగ్ని నుంచి నీరు, నీటి నుంచి భూమి, భూమి నుంచి చెట్లు, మొక్కలు, వాటి నుంచి ఆహారం, దానినుంచి భౌతిక శరీరం రూపొందింది అని దీనర్థం.** జీవుల పెరుగుదల నీటి ద్వారానే అయిందనే మాటను ఉపనిషత్తులు ఎంత కచ్చితంగా చెప్పాయో, నేటి విజ్ఞానశాస్త్రం కూడా సముద్రంలో అమినో ఆసిడ్లు కలిసి ప్రొటీన్ ఏర్పడి మొదటి ఏకకణ జీవి ఏర్పడింది అని సమర్థిస్తోంది. **జీవపు ఈ అభివృద్ధి యాత్రను పద్మపురాణం 84 లక్షల జీవులుగా విభజించింది. 2011లో ప్రచురితమైన సెన్సస్ ఆఫ్ మెరైన్ లైఫ్ పరిశోధన ప్రకారం శాస్త్రవేత్తలు భూమి మీద 87 లక్షల జీవరాశు ఉన్నాయని అంచనా వేశారు. వేల ఏళ్ళ క్రితమే మన ఋషులు 84 లక్షలు అని చెప్పడం ఆధునిక విజ్ఞాన శాస్త్ర అంచనాకు ఎంత దగ్గరగా ఉందో చూడండి.** ఇక దశావతారాలు అంటే కేవలం ఎవరో దుష్టుడినో, రాక్షసుడినో శిక్షించడానికి దేవుడు రకీమని దిగివచ్చిన సంగతి కాదు. అది భూమి మీద జీవం సాగివచ్చిన కోట్ల సంవత్సరాల అధికారిక చరిత్ర. దాని మొదటి అడుగు మత్స్యావతారం. భూమి మీద మొదట ప్రళయమేర్పడి, ఎక్కడ చూసినా నీరే. అందులోనుంచి జీవం చేప రూపంలో మొదటిసారిగా దేహపు ఆకారం పొందింది. విజ్ఞాన శాస్త్రంలో ఈ కాలాన్ని చేపల కాలంగా పిలిచారు.

**- కృష్ణప్రసాద్ భట్**

**(తరువాయి భాగం వచ్చే సంచికలో)**

# జ్ఞాపకశక్తిని పెంచే మూర్ధాసనం



సంస్కృతంలో 'మూర్ధ' అంటే 'తల పైభాగం' అని అర్థం. తలని నేలపై ఆనించి చేయడంతో ఈ ఆసనానికి ఆ పేరు వచ్చింది. ఈ ఆసనంలో గురుత్వాకర్షణ శక్తి శరీరానికి వ్యతిరేక దిశలో పని చేస్తుంది.

**చేసే విధానం:** ముందుగా యోగా మ్యాట్‌పై ప్రశాంతంగా నిల్చోండి. ఆపై నెమ్మదిగా కాళ్ల మధ్య రెండున్నర, మూడు అడుగుల వెడల్పు ఉండేలా చాపండి. ఇప్పుడు శరీరాన్ని సాగదీస్తూ రెండు చేతులను ముందుకు చాపుతూ కిందకు వంగండి. చేతులతో నేలపైన ఊతం తీసుకొని మొదటగా తలను సున్నితంగా నేలపైన ఆన్చండి. తర్వాత రెండు చేతులతో రెండు కాలి మడమలను పట్టుకొని శరీరాన్ని మరింత సాగదీయాలి. మోకాళ్లు వంచకుండా సాధారణ శ్వాసలు తీసుకుంటూ 10-15 సెకన్లు ఆసనంలో ఉండే ప్రయత్నం చేయండి. ఆపై చేతులను నేలపైన అదిమిపెట్టి తలను పైకెత్తి నెమ్మదిగా పైకి లేస్తూ, రెండు కాళ్లను దగ్గరగా తెచ్చుకొని నిదానంగా విశ్రాంతి తీసుకోవాలి.

**ఇవీ ప్రయోజనాలు:** జ్ఞాపకశక్తిని పెంచుతుంది. సయాటికా, వెరికోజ్ వెయిన్స్ నొప్పిని తగ్గించడానికి ఉపయోగపడుతుంది. తల కిందులుగా ఉండటం వల్ల మెదడు, ముఖ కండరాలకు రక్త ప్రసరణ, ఆక్సిజన్ సరఫరా అద్భుతంగా పెరుగుతుంది. చర్మం కాంతిమంతంగా తయారవుతుంది. ఈ ఆసనం క్రమం తప్పకుండా చేయడం వల్ల కాళ్ళ కండరాలు, వెన్నెముక, నడుము భాగాలు బలపడతాయి. ఒత్తిడి, ఆందోళనలను తగ్గించి ఏకాగ్రతను పెంచడానికి సహాయపడుతుంది. కాలేయం, క్లోమం, కిడ్నీల పనితీరును మెరుగుపరుస్తుంది.

**జాగ్రత్తలు:** అధిక రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు ఈ ఆసనాన్ని అస్సలు చేయకూడదు. తీవ్ర మెడ నొప్పి, వెన్నెముక సమస్యలు ఉన్నవారు దీనికి దూరంగా ఉండాలి. గ్లకోమా వంటి కంటి సమస్యలు, చెవి ఇన్ఫెక్షన్లు ఉన్నా ఈ ఆసనం వేయకూడదు.మైకం లేదా తల తిరుగుడు సమస్య ఉన్నవారు నిపుణుల సమక్షంలో సాధన చేయాలి.

**- పూజిత**

# గ్రామీణ సంస్కృతికి ప్రతీక చెమ్మచెక్క.. చారడేసి మొగ్గ..!

**చెమ్మచెక్క.. చారడేసి మొగ్గ..**
**అట్లు పొయ్యంగా.. ఆరగించంగా..**
**ముత్యాల చెమ్మచెక్క.. ముగ్గులెయ్యంగ..**
**రతనాల చెమ్మచెక్క.. రంగులెయ్యంగ..**
**పగడాల చెమ్మచెక్క.. పందిరెయ్యంగ..**
**పందిట్లో మా బావ... పెండ్లి చెయ్యంగ..**
**సూర్య దేవుడి పెండ్లి... చూసి వద్దాం రండి**
**మా వాళ్ళింట్లోకి వెళ్ళి... మళ్ళీ వద్దాం రండి..**
**దొరగారింట్లోకి వెళ్ళి.. దోచుకు వద్దాం రారండి...!!**

చెమ్మచెక్క అనే ఈ ఆట ఆడపిల్లలు సరదాగా ఆడుకునే ఆట. ఇది మన గ్రామీణ సంస్కృతికి, అరుదైన తెలుగు సంప్రదాయ ఆటలకు ఒక చక్కని ప్రతీక. పిల్లల్లో సంతోషాన్ని, సమన్వయాన్ని పెంపొందించే అద్భుతమైన జానపద గేయం ఇది. పండగల్లో నలుగురు ఆడపిల్లలు కలిస్తే చాలు, ఈ చెమ్మ చెక్క ఆటను ఎదురు బొదురుగా నిలబడి, చేతులు చాచి, ఒకరి చేతులు మరొకరికి తాటిస్తూ, ఎగురుతూ, గెంతుతూ, వెనకకు ముందుకూ వూగుతూ, అడుగుల లయకు చేతులు తట్టుతూ, పాటలు పాడుతారు. రంగు రంగుల దుస్తులతో వలయాకారంగా, వరుసన తప్పకుండా నృత్యం చేస్తూ వుంటే,అంగ రంగ వైభోగంగా ఉంటుంది. ఇద్దరు బాలికలు చొప్పున ఎదురెదురుగా నిలబడి చేతులను తడుతూ, బార్లా చాపి ఈ పాట పాడతారు. పాట లయకు అనుగుణంగా అడుగులు వేస్తూ, చిందులు తొక్కుతూ ఆడతారు. పాట పాడుతూ ఒకరి చేతులను ఒకరు తాకుతూ సంతోషంతో ఆడతారు. సర్కారు



జిల్లాలు, రాయలసీమలో పాడే పాట దీనికి కొంచెం భిన్నంగా ఉంటుంది. మొదటి చరణమైన 'చెమ్మ చెక్క' అనేటప్పుడు బాలికలు దగ్గరగా ఎదురెదురుగా నిలబడి కళ్లు, చేతులు తట్టుకోవాలి. 'చేరడేసి మొగ్గ' అనేటప్పుడు కాళ్ళతో వెనక్కి ఒక చిందు వేస్తూ, అదే సమయంలో చేతులు బార్లా చాపాలి. ఇదేవిధంగా ఇంకొక చరణం పాడుతూ మరోసారి బాలికలు దగ్గరకు చిందువేసి ఒకళ్ల కళ్ళు, చేతులు తట్టుకుంటారు. బాలికలు వేసే చిందులు పాట లయను అనుసరించి ఉండాలి. తెలుగు రాష్ట్రం మొత్తంలో ఈ ఆటకు ఈ పాటే పాడతారు.

**- బలరాం**

# కృపాజలనిధి కోదండరామయ్య

**వి**భీషణుడికి ఆశ్రయం ఇచ్చే విషయంలో సుగ్రీవుడు, అంగదుడు మొదలైన వారందరి అభిప్రాయాన్ని రాముడు అడుగుతాడు. తనకు అన్నీ తెలిసినా తమ వారి అభిప్రాయం కూడా తెలుసుకోవాలని అనుకోవడం అతని సుహృద్భావానికి నిదర్శనమని వారంతా రాముడిని ప్రశంసిస్తారు. స్నేహితుల అభిప్రాయం తెలుసుకోవడం వల్ల మనకు వచ్చే నష్టం ఏమీ ఉండదు. అయితే తమ అభిప్రాయానికి కూడా విలువ ఇస్తున్నందుకు వాళ్లు సంతోషిస్తారు. **రావణుడు తన భార్యను అపహరించిన వాడైనా, ఉద్ధతుడైనా యుద్ధ రంగంలో అతడిని చూసి రాముడు 'అహో దీప్త మహా తేజా రావణో రాక్షసేశ్వరః' అంటూ ప్రశంసిస్తాడు. సాధారణ మానవులకు, సత్పురుషులకు మధ్య భేదం ఇటువంటి విషయాల్లో కనిపిస్తుంది.** సాధారణంగా లోకంలో ఎవరైనా ఇతరుల లోపాలను గ్రహించినంత త్వరగా గుణాలను గుర్తించలేరు. ఒకవేళ గుర్తించినా ప్రశంసించరు. ఇది మన మిత్రులు, పరిచయం ఉన్నవారికి సంబంధించినంత వరకు. ఇక అవతలి వ్యక్తి శత్రువే అయితే వారి సద్గుణాలు మనకు అసలు కనిపించవు. మంచి, చెడులను విడదీయాలని చూసి, ఇతరుల లోపాలను గర్హించినట్లుగానే వారి గుణాలను ప్రశంసించ దగిన మానసిక స్థాయి మనకుంటే మన మనసు, బుద్ధి చాలావరకూ పరిణతి చెందినట్లే. 'కృపాజలనిధి' అని రాముడికి వాల్మీకి చెప్పిన విశేషణం. రాముడు దయకు సముద్రం



వంటివాడట. ఏ గ్రంథమైనా చెప్పేది అహింసా పరమోధర్మః అనే. ఏ మతమైనా బోధించేది ఇదే. నితాంతాపార భూతదయే మానవుడు పరమాత్మను అనునిత్యం కోరి పొందవలసిన వరం. దయ అనేది మానవుడి మృదు హృదయానికి చిహ్నం. **నిశ్చితమైన స్వభావం రాముడిలోని మరో ముఖ్య గుణం. ధర్మబద్ధమైన, నిర్దుష్టమైన మార్గాన్ని ఎంచుకున్న తర్వాత కార్య సాధనలో ఎటువంటి అడ్డంకులు వచ్చినా చలించకుండా నిలబడగలవాడే ధీరుడు. రాముడి ఈ నిశ్చిత స్వభావం అనేక సందర్భాల్లో కనిపిస్తుంది.** వనవాస సమయంలో రాముడు అరణ్యానికి వెళ్లకపోవడమే ఎక్కువమందికి ఆనందాన్ని కలిగిస్తుంది. లక్ష్మణుడు అండగా ఉండనే ఉన్నాడు. పౌర జానపదులకు ఈ వనవాసం అసలే ఇష్టం లేదు. రాముడు వెళ్లకపోతే స్వయంగా తండ్రి దశరథుడే సంతోషిస్తాడు. ఇవన్నీ తెలిసినా రాముడు తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు.

# చీర కట్టుతో అందం, ఆరోగ్యం!

**ఉజ్వల:** ఏంటి వదినా! ఫోన్ చూస్తూ అంత గట్టి గట్టిగా నవ్వుతున్నావు?

**రమ్య:** ఈ రీల్ చూడు వదినా! ఆడవాళ్లు వేసుకునే నైటీల మీద జోకులు.

**ఉజ్వల:** ఓ అదా... 24 గంటలు ఆ నైటీలు వేసుకునే ఆడవాళ్ళ గురించేనా? అందులో ఉన్నది నిజమే కదా. పుట్టిన రోజులకి, పెళ్లి రోజులకి చీరలు ఎందుకు కొనివ్వడం. ఎలాగూ రోజంతా నైటీలతోనే గడుపుతున్నప్పుడు.

**రమ్య:** ఎవరు కనిపెట్టారో కానీ ఈ నైటీని.. చీరకట్టులోని శాస్త్రీయతను తెలుసుకోకపోవడం వలన నష్టాలను అర్థం చేసుకోలేకపోతున్నారు.

**ఉజ్వల:** చీర కట్టడంలో శాస్త్రీయత ఏముంది? స్త్రీ అందంగా కనబడటానికి, అది మన ఆచారమనే కదా.



**రమ్య:** మన ఆచార వ్యవహారాలను ఊరికే పెట్టలేదు పెద్దలు. అన్నింటికీ ఒక కారణం ఉంటుంది. అలాగే చీరకట్టులో కూడా. ఈమధ్య మహిళల్లో డి-విటమిన్ లోపం ఎక్కువ అయ్యింది అని విన్నావా.

**ఉజ్వల:** అవును విన్నాను. అయినా దానికి, చీరకీ సంబంధం ఏంటి?

రమ్య: చీర కట్టినప్పుడు నడుము భాగం... మెడ, వెనకాల వీపుకీ సూర్యరశ్మి తగులుతుంది. తద్వారా డి-విటమిన్ అందుతుంది. అలాగే పురుషుల పంచె కట్టు కూడా శరీరానికి సూర్యరశ్మి తగిలేట్టుగానే ఉంటుంది. భారతీయుల చర్మంలో ఎండను తట్టుకునే సహజమైన మెలనిన్ ఎక్కువగా ఉంటుంది. కానీ ఈమధ్య ఆ చర్మంపై సన్ స్క్రీన్ లోషన్ రాసి మనకి కావాల్సిన డి-విటమిన్ శరీరంలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారు.

**ఉజ్వల :** వామ్మో... మన చీర కట్టులో ఇన్ని రహస్యాలు, లాభాలు దాగి ఉన్నాయా!

**రమ్య:** అంతే కాదు. బాపు బొమ్మలా మన శరీరాన్ని చీరకట్టు తీర్చిదిద్దుతుంది. అందానికి అందం.. ఆరోగ్యానికి ఆరోగ్యం. నైటీ వేయడం వలన అవయవాల పొందిక పోతుంది. ఒక డబ్బాకి తొడుగు తొడిగినట్టు ఉంటుంది. భర్త, పిల్లల ఎదురుగానే కాకుండా ఇంటికి అతిథులు వచ్చినప్పుడు కూడా అదే నైటీ. చూడటానికే ఎబ్బెట్టుగా ఉంటోంది. నిద్ర పోయేముందు వేసుకునే డ్రెస్‌ను రోజంతా వేసుకుని తిరిగితే గౌరవం గా ఉంటుందా?

**ఉజ్వల:** నిజమే కదా. చీర కట్టుకొని మారథాన్‌లో విజయం సాధించిన మహిళ గురించి ఈ మధ్య ఒక వార్త చూశాను. సాధించాలి అనే కోరిక ఉండాలి కానీ దుస్తులు అడ్డం కాదని ఇస్రో మహిళా శాస్త్రవేత్తలు కూడా నిరూపించారు కదా.

**రమ్య:** అనువు కాని చోట, చలి ప్రదేశంలో కట్టకపోయినా... మన చీర కట్టు... అందులోనూ భారతీయ స్త్రీ దుస్తులలో చీరకట్టుదే ప్రత్యేకత.

**- లింగం ఉజ్వల**

## పదకేళి 24

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | 3 | | 4 | ■ | 5 |
| ■ | | ■ | | ■ | 6 | 7 | |
| 8 | ■ | 9 | | 10 | ■ | | ■ |
| 11 | | | ■ | 12 | | ■ | 13 |
| | ■ | 14 | | | ■ | 15 | |
| 16 | 17 | | ■ | ■ | 18 | ■ | |
| 19 | | ■ | 20 | 21 | | 22 | |
| ■ | 23 | | ■ | | ■ | | ■ |

### ఆధారాలు

**అడ్డం**

1. ఆశ్వయుజ మాసంలో అమ్మవారి పండుగ (6)
6. బొట్టు (3)
9. ఆదమరపు (3)
11. తల్లి (3)
12. బంగారం తోడిది తిరగబడింది (2)
14. పశ్చిమానికి ప్రవహించే నది (3)
15. విశ్వదాభిరామ వినుర __ __ (2)
16. దుర్గమ్మకు సింహం ___ (3)
19. వాడ వెనక్కు తిరిగింది (2)
20. అయ్యప్ప కొలువైన కొండ (5)
23. నష్టానికి వ్యతిరేకం (2)

**నిలువు**

2. శమీ వృక్షం (2)
3. మైసూరు ఈ పండుగకు ప్రఖ్యాతి (3)
4. గడువు (2)
5. స్వర్గం (2)
7. భిన్నంలో పైన ఉండేది (2)
8. ఇంద్రకీలాద్రి ఉన్న ఊరు (5)
9. నైపుణ్యం (4)
10. బియ్యం కడుగు నీళ్ళు (3)
13. దసరాలో ఉత్తరాది వేడుక (4)
17. డబ్బులు బదలాయించే చట్టవిరుద్ధమైన పద్ధతి (3)
18. కొండ (2)
21. శక్తి (2)
22. స్వాములు ఉండేది (2)

**నిర్వహణ : ఫణీంద్ర పురాణపండ**

## పదకేళి 23 - జవాబులు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 కా | ణి | 2 పా | కం | ■ | 3 శ | 4 తా | బ్దం |
| వ | ■ | ట | ■ | 5 సం | ■ | ళు | ■ |
| 6 లి | 7 పి | ■ | 8 జా | త | 9 ర | ■ | 10 తి |
| ■ | 11 చి | 12 కా | గో | ■ | 13 న | వ | ల |
| 14 రా | క | డ | ■ | 15 గో | ము | ■ | క్ |
| ట్నం | ■ | ■ | 16 వై | రం | ■ | 17 ఈ | ■ |
| ■ | ■ | 18 పో | ■ | 19 త | 20 ల | గ | 21 డ |
| 22 వి | శ్వ | క | ర్మ | ■ | క్ష్మి | ■ | ప్పు |

# ఇండియా నుండి భారత్ ఒక ప్రయాణం

**భా**రతదేశం గురించి ఎవరైనా మాట్లాడితే వారిని తిరోగమనవాదులు, సంప్రదాయవాదులు అని ముద్ర వేసేవారు. దురదృష్టవశాత్తూ మన 'ఇండియా' ప్రయాణం 70 ఏళ్ళ పాటు సాగింది. ఈ 70 ఏళ్ళ కాలంలో మనతోపాటు స్వాతంత్ర్యం పొందిన దేశాలు మనకంటే బాగా ముందుకు వెళ్ళిపోయాయి. మనం మాత్రం ఉన్నచోటే మిగిలిపోయాము. ఇలా ఎందుకు జరిగింది? అంటే కారణం మనల్ని మనం మరచిపోవడమే. దీనివల్లే మనం వెనుకబడిపోయాము. మనదైన నిజమైన చరిత్రను మనం గుర్తించకపోతే ఇంకెవరు

## పుస్తక పరిచయం

**పుస్తకం పేరు:** 'ఇండియా' నుండి 'భారత్' ఒక ప్రయాణం

**రచయిత:** ప్రశాంత్ పోల్

**అనువాదం:** హైందవి

**ప్రచురణ:** సంవిత్ ప్రకాశన్, హైదరాబాద్.

**పేజీలు:** 164 **వెల:** రూ.190

**ప్రతులకు:** సాహిత్యనికేతన్, ఏలూరు రోడ్డు, రామమందిరం వీధి, గవర్నర్ పేట, విజయవాడ 520 002.

**సెల్ నం:** 8333812687




గుర్తిస్తారు? స్వాతంత్ర్యం తర్వాత ఈ దేశం 'ఇండియా' నుండి 'భారత్'గా ఎలా మారడం మొదలుపెట్టిందో చెప్పే సమాచారం ఈ పుస్తకంలో ఉంది. సంతోషించదగిన విషయం ఏమిటంటే 'ఇండియా' నుండి 'భారత్' ప్రయాణాన్ని మనం స్వయంగా చూస్తున్నాము. ప్రత్యక్షంగా చూసినా, ఒక్కోసారి అక్షర రూపంలో చూడటం మరింత ఆనందాన్నిస్తుంది. ఆ ఆనందాన్ని ఈ పుస్తకం అనుభవంలోకి తెస్తుంది.

## ఈ నెల శ్లోకము



**అమ్లానో బలవాన్ శూరః ఛాయేవానుగతః సదా ।**
**సత్యవాదీ మృదుర్దాన్తః స రాజవసతి వసేత్ ॥**

**భావము:** తొందరగా అలసిపోనివారు, శారీరకంగా బలాఢ్యులు, ధైర్యవంతులు, నీడలా వెంట ఉండి ఎల్లప్పుడూ రక్షణ కల్పించేవారు, సత్యవాదులు, మృదుస్వభావం కలిగినవారు, ఆత్మ సంయమనం కలిగిన వ్యక్తులకు రాజాశ్రయం పొందడానికి అర్హత ఉంటుంది.

# సేద్యంలో రైతన్నకు ఏఐ సాయం




**ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. అనేక అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పటికే సాగును శాస్త్రీయంగా, సాంకేతికంగా, డేటా ఆధారంగా చేయడం ప్రారంభించాయి. ఇక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రతీ రంగంలోనూ విస్తరిస్తోంది. ఇప్పటికీ దేశం జనాభాలో సుమారు 60 శాతం మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నారు.**

ఒకప్పుడు వర్షాలు, వాతావరణ అంచనాలు, అనుభవమే పెట్టుబడిగా సాగిన వ్యవసాయ రంగంలోకి నేడు అధునాతన సాంకేతికత దూసుకొచ్చింది. అన్ని రంగాలను శాసిస్తున్న కృత్రిమ మేధ(ఏఐ) ఇప్పుడు అన్నదాతకు వెన్నెముకలా నిలుస్తోంది. విత్తనం మొదలు మార్కెట్లో పంట అమ్ముడయ్యే వరకు రైతుకు ఏఐ తోడ్పడుతోంది. వర్షాధార సాగు సవాళ్లు, వాతావరణ మార్పులు, కూలీల కొరత వంటి సమస్యల్ని ఎదుర్కొనేందుకు కీలకంగా మారుతోంది. డిజిటల్ అగ్రికల్చర్ మిషన్‌లో భాగంగా ప్రభుత్వం కూడా 'భారత్-విస్తార్'తో ఏఐ సాధనాలను అందుబాటులోకి తెస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ అగ్రికల్చర్ మిషన్, డ్రోన్ల వినియోగం వంటి పథకాలు ఏఐ విప్లవానికి మరింత ఊతమిస్తున్నాయి.

### పెట్టుబడి ఖర్చులు ఆదా

పొలంలో పురుగు మందులు, ఎరువులు చల్లాలంటే పెద్దఎత్తున ఖర్చు అవుతుంది. ఏఐ ఆధారిత రోబోటిక్ ట్రాక్టర్లు, సెన్సర్లు వచ్చాక పరిస్థితి మారుతోంది. పొలంలో ఏ మొక్కకు తెగులు సోకిందో, ఎక్కడ ఎరువులు తక్కువగా ఉన్నాయో ఏఐ సెన్సర్లు పసిగడతాయి. మొత్తం పొలానికి మందులు చల్లాల్సిన పని లేకుండా, కేవలం సమస్య ఉన్నచోట మాత్రమే డ్రోన్లు లేదా యంత్రాల ద్వారా పిచికారీ చేయొచ్చు. దీనివల్ల పెట్టుబడి ఖర్చులు భారీగా తగ్గుతాయి. నేలలోని తేమ, భూసారాన్ని అంచనా వేస్తూ తగిన మోతాదులో నీటిని అందించే ఆటోమేటెడ్ ఇరిగేషన్ పద్ధతులు కూడా అందుబాటులోకి వచ్చాయి.

### మార్కెట్ డిమాండ్ అంచనా

పంట పండించడం ఎంత ముఖ్యమో దానికి సరైన గిట్టుబాటు ధర సాధించడం అంతకంటే ముఖ్యం. ఈ విషయంలోనూ రైతుకు ఏఐ అండగా నిలుస్తోంది. అంతర్జాతీయ మార్కెట్ అవసరాలు, గత కొన్నేళ్ల దిగుబడుల సరళిని విశ్లేషించి ఏ రకం పంటకు ఎక్కడ డిమాండ్ ఉందో ఏఐ ఆధారిత ప్రత్యేక డ్యాష్‌బోర్డులు మార్గదర్శనం చేస్తున్నాయి. డిజిటల్ ప్లాట్‌ఫాంల ద్వారా రైతులు నేరుగా ఎగుమతిదారులు, మార్కెట్ వర్గాలతో అనుసంధానమయ్యే అవకాశం లభిస్తోంది.

### రైతుల భద్రత, శిక్షణ కీలకం

ఏఐ వ్యవసాయాన్ని పూర్తిగా సాధించాలంటే రైతులకు శిక్షణ అవసరం. వారి వద్ద స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్నెట్ లభ్యత ఉండాలి. మౌలిక సదుపాయాల మరమ్మతులు, డిజిటల్ అక్షరాస్యత పెంపు కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాలు అవసరం. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ కంపెనీలు కలిసి రైతులను ఈ మార్గంలో నడిపించాలి. మౌలిక సదుపాయాల కల్పన, టెక్నాలజీ బదిలీ, ట్రైనింగ్ సెంటర్ల ఏర్పాటుతో పాటు, సబ్సిడీల రూపంలో ప్రోత్సాహకాలు ఇవ్వాలి.

## ఐఏఎఫ్‌కు అత్యాధునిక విమానాలు



భారత వైమానిక దళం అమ్ములపొదిలో స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన శక్తిమంతమైన విమానాలు (ఎయిర్‌క్రాఫ్ట్), హెలికాప్టర్లు చేరాయి. వీటిలో ఎల్‌సీఏ తేజస్ ఎఫ్‌ఓసీ ట్విన్ సీటర్ ట్రైనర్లు, హెచ్‌టీటీ-40 బేసిక్ ట్రైనర్ విమానాలు ఉన్నాయి. ఎల్‌సీఏ తేజస్ ఎఫ్‌ఓసీ ట్రైనర్ అనేది తేలికైన, అన్ని వాతావరణ పరిస్థితుల్లో పనిచేసే, బహుళ ప్రయోజనాలు గల 4.5 తరం విమానం. దీన్ని ప్రధానంగా ఐఏఎఫ్ శిక్షణా అవసరాల కోసం రూపొందించారు. ఈ విమానంలో రిలాక్స్ స్టాటిక్ స్టెబిలిటీ, క్వాడ్రుప్లెక్స్ ఫ్లై-బై-వైర్ ఫ్లైట్ కంట్రోల్ సిస్టమ్, కేర్‌ఫ్రీ మ్యానువరింగ్, అధునాతన గ్లాస్ కాక్‌పిట్, ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఏవియానిక్స్, అధునాతన కాంపోజిట్ ఎయిర్‌ఫ్రేమ్ మెటీరియల్స్ వంటి ఫీచర్లు ఉన్నాయి. ధ్రువ్ ఎన్‌జీ అనేది హెచ్‌ఏఎల్ తయారు చేసిన 5.5 టన్నుల బరువు గల తేలికపాటి హెలికాప్టర్. దీనిని భారతదేశపు మొట్టమొదటి స్వదేశీ పౌర హెలికాప్టర్‌గా అభివర్ణిస్తారు. ఇది 5,500 కిలోల టేకాఫ్ బరువును, గంటకు సుమారు 285 కిలోమీటర్ల గరిష్ఠ వేగాన్ని కలిగి ఉంది. ఇక హెచ్‌టీటీ- 40 అనేది భారత రక్షణ దళాల ప్రాథమిక ట్రైనింగ్ అవసరాలను తీర్చడానికి ఉద్దేశించిన స్వదేశీ ప్రాథమిక శిక్షణా విమానం.

**HINDU NAGARA**
Telugu Monthly, Volume : 34,Issue :10

Postal Registration No : VJ/152/2023-25, RIN No. 52882/93
Date of Publishing : 28-09-2026, Date of Posting : 06-10-2026, Pages : 16



# వేడుకగా బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవం

తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సెప్టెంబరు 15 నుంచి 23 వరకూ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉభయ దేవేరులతో కలసి ఎనిమిది రోజుల పాటు వివిధ వాహనాలపై ఊరేగిన మలయప్ప స్వామిని దేశ, విదేశాల నుంచి తరలివచ్చిన దాదాపు 5.76 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. ఐదో రోజున స్వామివారు తనకు ప్రీతిపాత్రమైన గరుడ వాహనంపై మాడ వీధుల్లో విహరించారు. భక్తుల గోవింద నామస్మరణలతో తిరువీధులు మార్మోగాయి.



# విజయవాడలో శ్రద్ధేయ అశోక్ సింఘాల్ జీ శతజయంతి సభ

విశ్వహిందూ పరిషత్ శ్రద్ధేయ అశోక్ సింఘాల్ జీ శతజయంతి సందర్భంగా విజయవాడలో విశిష్ట వ్యక్తుల సమావేశం నిర్వహించారు. కేంద్రీయ సంయుక్త కార్యదర్శి శ్రీ కప్పగంతుల కోటేశ్వర శర్మ మాట్లాడుతూ హిందూ సమాజ సంఘటన కోసం అశోక్ సింఘాల్ జీ తన జీవితాన్ని ధారపోశారని తెలిపారు. విశ్వ హిందూ పరిషత్ విస్తరణ, వివిధ అయామ్‌లను ప్రవేశపెట్టడం ద్వారా సమాజంలో మార్పులకు శ్రీకారం చుట్టారని కొనియాడారు. సాధు సంసద్ ద్వారా హిందువులు అందరూ ఒకటేనని, కులభావన ,అస్పృశ్యత పూర్వం లేదని, దానికోసమే హిందవ సోదరా సర్వే, న హిందు పతితో భవేత్, మమ దీక్ష హిందూ రక్ష , మమ మంత్ర సమానత అనే సందేశాన్ని సాధు సంతుల ద్వారా సమాజానికి అందించారని






వివరించారు. శైవ పీఠాధిపతి శ్రీ శివ స్వామి ఆశీ ప్రవచనం చేశారు. కార్యక్రమంలో కేంద్రీయ ఉపాధ్యక్షులు శ్రీ గోకరాజు గంగరాజు, కేంద్రీయ కార్యకారిణి సదస్యులు శ్రీ యక్కలి రాఘవులు, భాగ్యనగర్ క్షేత్ర సంఘటన కార్యదర్శి శ్రీ గుమ్మళ్ళ సత్యం జీ, భాగ్యనగర్ క్షేత్ర కార్యదర్శి శ్రీ తనికెళ్ల సత్య రవికుమార్, ఆరెస్సెస్ ప్రాంత ప్రచారకులు శ్రీ విజయ ఆదిత్య, ప్రాంత అధ్యక్షులు శ్రీ వబిలిశెట్టి శ్రీవేంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు శ్రీ విశ్వేశ్వరరావు, ప్రాంత కార్యదర్శి శ్రీ భూపతిరాజు సుబ్బరాజు, ప్రాంత సహ కార్యదర్శి శ్రీ ఫాల్గుణ రావు, ప్రాంత కోశాధికారి శ్రీ వలివర్తి దుర్గాప్రసాద్ రాజు, విశ్వ హిందూ పరిషత్ జేష్ట కార్యకర్తలు, సామాజిక పెద్దలు, హిందూ బంధువులు సమాజంలో విశిష్ట వ్యక్తులు పాల్గొన్నారు.

Published by : Tulasi Surya Prakash on behalf of Sahiti Sudha Foundation from Madhavasadan, Kaleswara Rao Road, Governorpet, Vijayawada - 520002 and Printer Chiruvolu Vasu Deva Rao and Printed at : B.S.R. Enterprises, D.No: 32-26-110/6, Narra Gopala Krishnaiah Street, Maruthi Nagar, VIJAYAWADA - 520004, Editor : Chiruvolu Vasu Deva Rao, Cell : 9490923439